క్లుప్తంగా

అభివృద్ధి పనులకు సహకరించాలి



వేమూరు: వేమూరు మండల అభివృద్ధికి అధికారులు పూర్తిగా సహకరించాలని ఎంపీపీ యల్లమట్టి మోహన్ రావు అన్నారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో సీజనల్ జ్వరాలు విపరీతంగా ప్రబలుతున్నట్లు తెలిపారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సర్వసభ్య సమావేశం చాలా మందికి అధికారులు హాజరు కాలేదని మండి పడ్డాడు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, సుశీల పాల్గొన్నారు.

రసాయనాల కంటే కషాయాలు మేలు



పిట్టలవానిపాలెం: వరిలో రసాయనాల కంటే కషాయాలు చాలా మేలని జెడ్‌బీఎన్‌ఎఫ్ బాపట్ల డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మంతెనవారిపాలెం క్లస్టర్ పరిధిలోని దేగలవారిపాలెం గ్రామంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక జడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బందితో కలిసి చేప, బెల్లం ద్రావణాన్ని తయారు చేశారు. 20 కిలోల పచ్చి చేపల వ్యర్థాలు, 20 కిలోల తక్కు బెల్లంను ప్లాస్టిక్ డ్రమ్ములో కలియబెట్టాలని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం రెండు పూటలా కర్రతో కలియబెట్టాలని.. ఈ విధంగా 12 రోజులపాటు చేయాలని తెలిపారు. 12 రోజుల తర్వాత చేప, బెల్లం ద్రావణంను వడబోసి 250 ఎంఎల్‌ను 100 లీటర్ల నీటిలో ఎకరం పొలంలో పిచికారీ చేయాలని తెలిపారు. దీని వల్ల పైరు బలంగా ఏపుగా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెనవారిపాలెం క్లస్టర్ యూనిట్ ఎల్‌టీ సౌజన్య, ఐసీఆర్‌పీ సుమతి, లావణ్య రైతులు ఉన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని వేజళ్లవారి లంక గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిబాబు వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో మోర్లవారిపాలెం పంచాయతీ వేజళ్లవారి లంక గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామ శివారులో ముగ్గురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంతో వీరి నుంచి రూ.10,220ల నగదును స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామన్నారు.

నేటి నుంచి పెదపులివర్రులో అమ్మవార్లకు పూజలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో శివ, వైష్ణవాలయాలు, గ్రామ దేవతలు బాలాత్రిపురసుందరి, పేరిందేవి, గోగులమ్మ అమ్మవార్లకు శ్రావణమాసం పురస్కరించుకుని సోమవారం నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, దీవి రాంబాబులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం అమ్మవార్లకు గోత్ర నామాలతో పాటు కుంకుమార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భట్టిప్రోలులో ఉచిత వైద్య శిబిరం



భట్టిప్రోలు: శ్రీ సత్యసాయి భజన మండలి –భట్టిప్రోలు, కేర్ యోగా నాచురోపతి, ఆయుర్వేద, హోమియోపతి హాస్పటల్– పిట్టలవానిపాలెం ఆధ్వర్యంలో ఆదివారం భట్టిప్రోలు రథం సెంటర్‌లోని శ్రీ సాయికృష్ణ కల్యాణ కళా వేదిక ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల వైద్యులు డాక్టర్ బి. సూర్యవంశీ, డాక్టర్ బి. బ్రాహ్మణి, డాక్టర్ కెబీ సమీరా నడుము, మెడ, మోకాళ్ల నొప్పులు, సయాటిక, నరముల బలహీనత, రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గర్భకోశ, చర్మ, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్య సలహాలు అందించారు. శిబిరంలో 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా నిర్వాహకులు తుమ్మల శ్రీనివాసరావు, అన్నె రవి కుమార్, మరీదు గోవర్ధన, బసవపున్నయ్యలు విచ్చేశారు. భజన మండలి నిర్వాహకులు సుబ్బారావు, సాయిగణేష్ కుమార్, దీవి శ్రీరామకృష్ణ, వెంకటేశ్వరరావు, చినబుజ్జి, కొతరపు ప్రసాద్, తూనుగుంట్ల శ్రీధర్, తమ్మన రమేష్‌బాబు, ఎం. శశికళ, టి. నాగమణి, టి. మాధవి, ఎం. నళిని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపై పసుపు నీడలు..

ప్రభుత్వ విద్యపై ప్రస్తుతం మెల్లిగా పసుపు నీడలు కమ్ముకుంటున్నాయి. ప్రైవేట్‌కు పట్టం కట్టే ప్రభుత్వంలో పేద పిల్లల చదువు కష్టం కానుంది. ఎక్కడికక్కడ పాఠశాలల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. యథాస్థితిలో సార్కార్ బడుల కష్టాలు తిష్టవేయనున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలలను పరిశీలించినప్పుడు ఈ విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలకు పగుళ్లొస్తున్నాయి. మళ్లీ మొక్కు'బడి'లా మారుతున్న పరిస్థితులు కళ్లకు కడుతున్నాయి.– రేపల్లె రూరల్



కొల్లూరు మండలం చినపులివర్రులో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో బోధన ఇలా..




కొల్లూరు మండలం దోనేపూడి శివారు ఆలపాటినగరంలో శిథిలావస్థలో, కంతలు పడిన రేకుల గదిలో పాఠాల బోధన



కొల్లూరు మండలం దోనేపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద మంజూరైన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా..

దొక్కా సీతమ్మా.. మరుగుదొడ్డి నీటితోనే పిల్లలకు భోజనమమ్మా..

కొల్లూరు : దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి మరుగుదొడ్డి నీరే దిక్కయ్యింది. జగనన్న గోరుముద్ద పథకాన్ని..పేరు మార్చి దొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం పేరును ఖరారు చేసిన ప్రభుత్వం.. పథకం నిర్వహణలో నాణ్యత, శుభ్రతలపై శ్రద్ధను వదిలేసింది. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు అపరిశుభ్రమైన నీటితో ఇలా ఆహారాన్ని వండి పిల్లలకు అందిస్తున్నారు. దోనేపూడి ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యహ్న భోజనం తయారీ తీరు కళ్లకు కట్టినట్లు ఇలా...



భోజనం తయారీకి మరుగుదొడ్డిలో పడుతున్న నీరు



మరుగుదొడ్డిలో పట్టిన నీటిని ఇలా మధ్యాహ్న భోజనం తయారీకి వాడే పాత్రలో పోస్తున్న వైనం..



మరుగుదొడ్డి నుంచి నీటిని తెస్తున్న విద్యార్థిని..



దోనేపూడి జెడ్పీ ఉన్నతపాఠశాలలో నాడు-నేడు పథకంలో నిర్మాణం పూర్తవకుండానే అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: ఐటీఐలో ప్రవేశం కొరకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ శ్యాం ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల మూడవ దఫా ప్రవేశానికి రెండు సంవత్సరాల కోర్సులు మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఒక సంవత్సరం కోర్సు మెకానిక్ డీజిల్ సీట్లకు ఈ నెల 2వ నుంచి 26వ తేది సాయంత్రం 5 గంటల లోపు iti.ap.gov.in నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు 28తేదీ లోపు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్స్ తో కళాశాలకు హాజరై.. సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. 29వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే అడ్మిషన్‌కు హాజరు కావాలని వివరించారు. మరిన్ని వివరాల కోసం 77024 00570, 93986 50408, 94911 85900 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ చల్లా రామోహన్‌రావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని చెప్పారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత జీవనం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టివి సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, సమితి సభ్యులు పి.బాపిరాజు, ఆరె వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, టి.లలితబాబు, బి.బుల్లియ్య, శ్రీనివాసరెడ్డి, చందు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామోహన్‌రావు

పాత కోర్టులో చిల్లచెట్ల తొలగింపు..



పాత కోర్టుభవనాల సముదాయంలో పెరిగిన చిల్ల చెట్లు



చెట్లను తొలగించిన మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బాపట్లటౌన్: బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో గతంలో నిర్మించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రాంగణంలో చిల్లచెట్లు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీనిపై జులై 22న సాక్షిలో ప్రచురితమైన "భవనాలు నిరుపయోగం...జూదరులకు నిలయం" అనే కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు రెండురోజుల క్రితం పాత కోర్టు ప్రాంగణంలోని చెట్లను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరదతో అప్రమత్తంగా ఉండాలి

భట్టిప్రోలు: కృష్ణా నదీ తీరం లంక గ్రామాలకు వరద తీవ్రతను బట్టి అధికారుల సూచనల మేరకు లోతట్టు గ్రామాల ప్రజలు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇప్పటికే ఆర్డీవో, జేసీలకు లోతట్టు ప్రాంతాల్లోని నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలను తరలించేందుకు సంబంధించిన వివరాలను పంపడం జరిగిందని తెలిపారు. మండలంలోని చింత మోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం గ్రామాలు వరద ముంపుకు గురయ్యే ప్రమాదం నెలకొందని అన్నారు.

వరద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి తహసీల్దార్ శ్రీనివాసరావు వివరించారు. కృష్ణా ప్రకాశం బ్యారేజీ వద్ద 4 లక్షల క్యూసెక్కులు దాటితే భట్టిప్రోలు మండలంలోని ప్రమాదం నెలకొంటుందని ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరిగిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పల్లెకోన ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ ఏడుకొండలు ఆదివారం తెలిపారు. అలాగే పెదపులివర్రు సబ్‌స్టేషన్ పెసర్లంక ఫీడర్ పరిధిలో కూడా ఇదే విధంగా సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు విఘాతం కలగనున్నట్లు తెలిపారు.

ఐలవరంలో తులసీదాస్ జయంతి

భట్టిప్రోలు: సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం ఐలవరం శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం తులసీదాస్ జయంతి పురస్కరించుకుని శ్రీ లక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ఆదివారం తెలిపారు. పరమ రామ భక్తుడైన తులసీదాస్ రాముడు, రామ నామం గొప్పతనం గూర్చి తెలియచేసిన మహనీయుడని చెప్పారు. రామాలయాలు, హనుమాన్ దేవాలయాల్లో ఛాలీసా పారాయణం నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు పేర్కొన్నారు. విష్ణువును పూజించడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని, భట్టిప్రోలు మండలం ఐలవరంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో వూట కాల్వ వద్ద కొలువెన శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం (దేవుడమ్మ గుడి) చతుర్థ వార్షికోత్సవాలు సోమవారం నుంచి బుధవారం వరకు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రఖ్యా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి గణపతి, కాలసర్ప సుబ్రహ్మణ్యం, శ్రీ చండీ, శ్రీ రుద్ర హోమాదులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆఖరి రోజు మహా ఏకాదశ రుద్రహోమం, నక్షత్ర నవగ్రహ హోమం, రాత్రి శాంతి కల్యాణం జరుగుతాయని వివరించారు.

ఆంగ్ల అధ్యాపకుడికి డాక్టరేట్



భట్టిప్రోలు: భట్టిప్రోలు కేఎస్‌కే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న బిట్రా భానుశంకర్ ఐసీటీ అవేర్‌నెస్ అండ్ యాటిట్యూడ్ టూవార్డ్స్ ఐసీటీ ఎమాంగ్ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. చేనేత కుటుంబానికి చెందిన భానుశంకర్‌ది చెరుకుపల్లి మండలం రాజవోలు గ్రామం. ప్రొఫెసర్ ఎం.రవి కుమార్ (ఆర్‌వీఆర్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్–ప్రిన్సిపాల్) పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కేఎస్‌కే విద్యా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, సీఈవో డాక్టర్ కె. డేవిడ్ యశ్వంత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భానుశంకర్‌ను అభినందించారు.

హడలెత్తించిన వీధి కుక్క

తెనాలి: ఇంటి చావడిలో మంచంపై నిద్రపోతున్న ఓ వృద్ధుడిని ఓ వీధి కుక్క దారుణంగా కరిచింది. తలకింద చెయ్యి పెట్టుకుని నిద్రిస్తుండగా వీధికుక్క దాడిచేసింది. మోచేతి కండ పీకేసింది. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు. వివరాలు.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని ఆరేపల్లి యాదవపాలెంలో బి.సుబ్బారావు అనే 85 ఏళ్ల వృద్ధుడు ఆదివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో భోజనం చేశాడు. అలవాటు ప్రకారం ఇంటిని ఆనుకుని ఉండే చావడిలోకి వెళ్లి మంచంపై నిద్రకు ఉపక్రమించాడు. కొద్దినిముషాల్లోనే అటువైపు వచ్చిన ఓ వీధికుక్క సుబ్బారావు తలకింద పెట్టుకున్న ఎడమచేతిని నోటికి తీసుకుంది. కసితీరా కండ ఊడేలా కరిచేసింది. ఉలిక్కిపడి లేచిన సుబ్బారావు అరుపులకు బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు, కుక్కను తరిమేశారు. అప్పటికే అతడి చేతినుంచి కండ ఊడిపోయి, రక్తమోడుతోంది. దీనితో అతడిని హుటాహుటిన తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి, అనంతరం కుట్లు వేశారు. ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఆకురాతి వెంకట సుబ్బారావు



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న నిర్వాహకులు

రేపల్లె రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆకురాతి వెంకట సుబ్బారావు అన్నారు. పద్మశాలీయ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నయాగర ఫంక్షన్ హాలులో ఆదివారం పద్మశాలీయ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పేద విద్యార్థులు, ప్రతిభ చూపిన వారిని ఆదుకునేందుకు సంఘీయులు ముందుండాలన్నారు. చదువుతో ప్రతి ఒక్కరి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయవచ్చన్నారు. మనిషి సంపాదించిన ఆస్తులలో దొంగలు దొంగతనం చేయలేని ఆస్తి విద్య అని, ఆ విద్యను తమ పిల్లలకు అందించి ఉన్నత శిఖరాలు చేరుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 2023–24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన 10వ తరగతికి చెందిన 17 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1500ల చొప్పున, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరిచిన 19 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా 30 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోస్తా ఆంధ్ర పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గుద్దంటి వెంకట నాగేశ్వరరావు, రిటైర్డ్ డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ నారాయణం రామమోహనరావు, సంఘ సభ్యులు పట్టెం శ్రీనివాసరావు, పొలిశెట్టి శ్రీనివాసరావు, పాలెపు ప్రమోద్‌కుమార్, అడిగోపుల రాంబాబు, మునగాల నాగేశ్వరరావు, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స విధానంపై అవగాహన ఉండాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ వీరరాఘవయ్య



మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య

రేపల్లె రూరల్: ప్రమాదానికిగురైన వారికి ప్రమాద స్థలంలోగాని, వైద్యశాలకు తీసుకువచ్చిన వెంటనేగాని ఆరోగ్య కార్యకర్తలు ప్రథమ చికిత్స అందించే విధానంపై అవగాహన ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా వైస్‌చైర్మన్, రేపల్లె సబ్‌డిస్ట్రిక్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. ఇండియన్ రేపల్లె సబ్‌డిస్ట్రిక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఎమర్జన్సీ కేర్ వైద్యశాలలోని టీమ్‌సభ్యులందరికి స్థానిక వైద్యశాలలో తిరుపతికి చెందిన రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రత్నశేఖర్‌చే ప్రథమ చికిత్సపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీరరాఘవయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రథమ చికిత్సలో అతిముఖ్యమైన కార్డియోపల్మోనరీ రెస్యుసియేషన్ (సీపీఆర్)ను పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. మనిషి ప్రాణాలు కోల్పోకుండా ఈ ప్రథమ చికిత్స విధానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. శిక్షణా తరగతులను ఆరోగ్య కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో టెక్నీషియన్ సాంబశివరావు, రెడ్ క్రాస్ సిబ్బంది ప్రభాకరరావు, సయ్యద్ కరీముల్లాలు, బ్లడ్ బ్యాంక్ కార్యకర్తలు, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావం..తెస్తుంది గౌరవం

రేపల్లె రూరల్ : అంకిత భావంతో విధులు నిర్వర్తించే వారికి ఎప్పుడూ గౌరవ మర్యాదలు లభిస్తాయని భారత్ మజ్దూర్ యూనియన్ సంఘ నాయకులు డీఎల్ కాంతారావు అన్నారు. రేపల్లె హెడ్ పోస్టాఫీసులో మల్టీ టాస్క్ స్టాఫ్ (ఎంటీఎస్)గా విధులు నిర్వర్తిస్తున్న ఆరేపల్లి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా స్థానిక పోస్టాఫీసు కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రోజున ఉద్యోగ విరమణ రోజు నమోదై ఉంటుందన్నారు. తమ బాధ్యతలు నిర్వర్తించే కాలంలో నిబద్ధతతో విధులు నిర్వర్తించే ఉద్యోగి ప్రతి ఒక్కరి మన్ననలు పొందుతారని చెప్పారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులను కార్యాలయ అధికారులు, వివిధ యూనియన్ల సభ్యులు, సిబ్బంది పూలమాలలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ అసోసియేషన్ నాయకులు నరేంద్ర, పోస్టల్ కార్యాలయ సిబ్బంది ఎ.పోతురాజు, రాధకృష్ణ, జ్యోతి, గోపి, కార్తీక్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

ధన్యజీవి ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

బాపట్ల: ఉపాధ్యాయుడిగా, చిత్రకారుడిగా, సమాజ సేవా తత్పరుడుగా బహుముఖ సేవలందించటంలో బదిరులు పాఠశాల ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు జీవి తనదైన ముద్రవేసుకున్నారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి.సి.సాయిబాబు తెలిపారు. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టరు పి.సి.సాయిబాబు మాట్లాడుతూ చిత్రకారుడిగా తన సత్తా చూపి, పలు అవార్డులను గెలుచుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేషన్, రచయత మల్లికార్జున, చిత్రకారులు తోట వెంకట నారాయణ, ఉమామహేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ మూర్తి, భావపురి రచయతల సంఘం నాయకులు తిమ్మన శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

ఆ ఫుట్‌పాత్ ప్రదేశం ఇక ఖాళీ

- ఎంతోకాలంగా అక్కడే ఉంటున్న వ్యక్తి
- మండే ఎండ.. జోరు వర్షం ఏదైనా సరే!
- అనారోగ్యంతో మృతి
- స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



ఓవర్‌బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై వ్యక్తి

తెనాలి: ఈ గాలితో.. ఈ వానతో.. ఈ ఎండతో.. ఈ సమాజంతో సంబంధం లేదన్నట్లు.. అతడు ఎక్కడివాడో తెలీదు... చెంచుపేట నుంచి వచ్చేటప్పుడు రైల్ ఓవర్ బ్రిడ్జి ఆరంభంలో ఎడమవైపు రెయిలింగ్‌కు ఆనుకుని ఫుట్‌పాత్‌పైనే నివాసం. కింద ఓ బొంత, రెయిలింగ్ పైనుంచి కొన్ని దుప్పట్లు తనపై కప్పుకుని ఉంటాడు. భారీ వర్షంలో, 45 డిగ్రీల ఎండ వేడిమిలోనూ అక్కడే పడకసీనులో ఓవర్‌బ్రిడ్జి ఎక్కి దిగే ప్రతివారికీ కనిపిస్తాడు. ఎవరైనా ఆహారం పెడితే లేచి కూర్చుని తీసుకుంటాడు. ఆకలి తీరుతుంది...మళ్లీ యథాస్థితిలోకి వెళతాడు. ఏమైందో ఏమో తెలీదు...

ఆదివారం ఉదయం విగతజీవుడై కనిపించాడు. విషయం తెలిసిన స్థానిక హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ప్రతినిధి షేక్ ఇనయతుల్లా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం వద్ద దుస్తుల్లో ఆధార్ కార్డు లభించింది. అందులోని వివరాల ప్రకారం కొత్తపల్లి జగన్‌మోహనరావు, తురిమెళ్ల అని ఉంది. అంతకుమించి వివరాలేవీ లేవు. అనాథ కావటంతో హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో అతడి మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. అక్కడే అంత్యక్రియలను పూర్తిచేశారు. ఇనయ్‌తుల్లా, ఆయన మిత్ర బృందం రవి, సంజయ్, వేణును స్థానికులు అభినందించారు.